ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 16 | ఏప్రిల్ | 2024
పేజీలు 8

## 18 నుంచి నామినేషన్ల స్వీకరణ



కలెక్టర్ విపి గౌతమ్

వివరాలు 2లో

# తలుపులు తీశారట..!

## ఎవరైనా రావచ్చు

### చేరికలపై అభ్యంతరాలు వద్దని కాంగ్రెస్ నేతల నిర్ణయం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకునే వారికి స్థానిక నాయకత్వం నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఓ రాజకీయ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన ఏ పార్టీలో ఉన్న ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తే అడ్డు చెప్పరాదని ఎవరినైనా చేర్చుకోవాల్సిందేనంటూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి అధిష్ఠానం హుకుం జారీ చేసింది. హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేతలు నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత బిఆర్ఎస్ సహా ఇతర పార్టీలకు చెందిన అనేక మంది కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నాయకత్వాల నుంచి కొంత మంది ప్రతికూలత ఎదురైతే జిల్లా స్థాయిలో మరికొంత మందికి ప్రతికూలత ఎదురవుతుంది. కొంత మంది చేరితే పార్టీకి నష్టం కలుగుతుందని స్థానిక నేతలు అధిష్ఠానం పై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. బిఆర్ఎస్‌ను వీడే నాయకుడు కాంగ్రెస్ అవకాశం కల్పించక పోతే బిజెపి వైపు వెళ్లే అవకాశం ఉందని రాష్ట్రంలో బిజెపి బలపడడం మంచిది కాదని పార్టీ మారాలనుకునే నేతలకు కాంగ్రెస్ అవకాశం కల్పించి పార్టీలో చేర్చుకోవాలని తద్వారా బిజెపి బలపడకుండా బిఆర్ఎస్‌ను బలహీనపర్చవచ్చునని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో అనేక దశాబ్దాల పాటు కాంగ్రెస్‌లో పనిచేసి ఇటీవల బిజెపి లేదా బిఆర్ఎస్‌లో చేరిన నేతలు తిరిగి కాంగ్రెస్‌లోకి రావడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుంది. ఉదాహరణకు ఖమ్మంజిల్లాలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అనేక దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. నాలుగుసార్లు శాసన సభ్యునిగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసిన ఆయన గతేడాది జరిగిన శాసన సభ ఎన్నికల్లో టికెట్ దక్కక పోవడంతో బిఆర్ఎస్‌లో చేరారు. తిరిగి ఆయన కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు స్థానికులు విముఖత వ్యక్తం చేస్తున్నారన్న ప్రచార నేపథ్యంలో ఇటువంటి వ్యక్తులకు కాంగ్రెస్ నిర్ణయం సదావకాశంగా మారే అవకాశం ఉంది. పార్లమెంటు ఎన్నికలపై దృష్టిసారించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యధిక స్థానాలను గెలుచుకోవడంతో పాటు బిజెపి, బిఆర్ఎస్‌లను నిలువరించాలని అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 14 స్థానాల్లో విజయం సాధిస్తామని చెబుతున్నారు. అన్ని వర్గాలను కలుపుకుపోవడం ద్వారా మాత్రమే మెజార్టీ సీట్లు సాధించడం సాధ్యమవుతుందని అందుకే చేరికలకు అడ్డు చెప్పకపోవడంతో ప్రోత్సహించాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్‌లో చేరాలనుకునే అనేక మందికి ఇప్పుడు ఇది సదావకాశంగా మారింది. నిన్న మొన్నటి వరకు అధాకారాన్ని అనుభవించి ఇప్పుడు ఏ పార్టీలో చేరే అవకాశం లేక అధికారానికి అలవాటు పడి ఇబ్బందులు పడుతున్న కొందరు నేతలు ఇక మూడు రంగుల కండువా కప్పు కోవడమే ఆలస్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

## వీడని ఖమ్మం చిక్కుముడి..!




- -ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి
- -సంప్రదింపుల కమిటీ ఛైర్మన్‌గా భట్టి
- -క్యాడర్‌లో తీవ్ర నిరాశ
- -భిన్నాభిప్రాయాలకు తావిస్తున్న తాత్సారం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గానే మారింది. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడం, పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం, అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్న నాయకులు బలమైన వారు కావడంతో అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి ఇబ్బంది కరంగా మారింది. ఖమ్మం పార్లమెంటు స్థానం ఆది నుంచి కాంగ్రెస్‌కు పెట్టని కోట. తొలినాళ్లలో వరుసగా రెండు సార్లు కమ్యూనిస్టులు గెలిచిన తర్వాత ఇక కాంగ్రెస్‌కు ఎదురు లేకుండాపోయింది. ఆ తర్వాత ఒకసారి సిపిఎం, మరోసారి టిడిపి, వైకాపాలు విజయం సాధించాయి. 17 సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్సేతర పార్టీలు గెలిచింది ఐదుసార్లే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుంటే చాలు పార్లమెంటు సభ్యునిగా

మిగతా 2లో..

## శరవేగంగా శ్రీరామ నవమి పనులు



- - రూపుదిద్దుకుంటున్న కళ్యాణమండపం
- - తలంబ్రాలు, ప్రసాదాల కౌంటర్లు సిద్ధం
- - భక్తుల కోసం 2 లక్షల ప్రసాదాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** దేవుడి పెళ్లికి భద్రాద్రి ముస్తాబవుతోంది. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపం ప్రాంగణం రూపు దిద్దుకుంటోంది. మిథిలా స్టేడియంతో పాటు ఆలయం చుట్టూ పందిళ్లను సిద్ధం చేశారు. ఉత్తర ద్వారం నుండి బ్రిడ్జి పాయింట్ వరకు కూడా ఛాందినీ వస్త్రాలతో పందిళ్ళు వేశారు. కళ్యాణ మండపంలో వివిఐపి, విఐపి తోపాటు ప్రెస్, ఇతర సెక్టార్లు సిద్ధం

మిగతా 2లో..

# వీడని ఖమ్మం చిక్కుముడి..!





**(మొదటిపేజీ తరువాయి)**



ఎన్నికైనట్లేనన్న భావన నేతల్లో నెలకొంది. అందుకే అభ్యర్థిత్వం కోసం గట్టిగా పట్టుబడుతున్నారు. గతంలో ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు పార్లమెంటు స్థానం కోసం పోటీ పడగా అధిష్టానం మంత్రుల కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వడం లేదని తేల్చి చెప్పింది. కానీ గతంలో జరిగిన ఒప్పందాలను పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధిష్టానం ముందుంచి నాకు ఇచ్చిన హామీని నిలబెట్టాలని గట్టిగా పట్టుబడుతున్నారు. పొంగులేటి బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే సమయంలో కొన్ని శాసన సభ స్థానాలతో పాటు ఖమ్మం పార్లమెంటు స్థానం కూడా తాను సూచించిన వ్యక్తులకే ఇవ్వాలని షరతు విధించగా అప్పట్లో అధిష్టానం దానికి పూర్తి అంగీకారం తెలిపింది. పార్లమెంటు ఎన్నికల ముంగిట తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన గట్టిగానే ఒత్తిడి తేవడంతో పాటు ఒక్కింత కరుకుగా మాట్లాడినట్లు సమాచారం. ఖమ్మం పార్లమెంటు స్థానం కోసం తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరులు పొంగులేటి ప్రసాదరెడ్డితో పాటు పలువురు పోటీ పడుతున్నారు. ఓ దశలో మంత్రుల కుటుంబ సభ్యులకు అవకాశం లేదన్న తర్వాత మాజీ టిడిపి నేత, ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు మండవ వెంకటేశ్వరరావు జిల్లాకు చెందిన వివిసి గ్రూప్ అధినేత రాజేంద్ర ప్రసాద్, రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, వి. హన్మంతరావు పేర్లు తెర పైకి వచ్చాయి. చివర్లో రాయల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు లలో ఎవరో ఒకరికి అవకాశం లభిస్తుందని భావించారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నేతల సమావేశం తర్వాత మళ్లీ ప్రసాద రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మంత్రి పొంగులేటి నిరసన గళం, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్న డిమాండ్ నేపథ్యంలో పొంగులేటి ప్రసాదరెడ్డి పేరు తెర పైకి వచ్చింది. చివరకు నిర్ణయం తీసుకోలేని కాంగ్రెస్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఖమ్మంజిల్లాకు చెందిన మల్లు భట్టివిక్రమార్కను సంప్రదింపుల కమిటీ ఛైర్మన్‌గా నియమించింది. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ నేతలు ఆశావాహులతో సంప్రదించి అభ్యర్థి పై ఏకాభిప్రాయాన్ని తీసుకు వచ్చే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఇదిలా ఉండగా మంత్రుల కుటుంబ సభ్యులలో ఏ ఒక్కరికి ఇచ్చేందుకు ముగ్గురి మధ్యలో ఏకాభిప్రాయం వ్యక్తం కావడం లేదని అలాగని ఎవరినైనా వలస అభ్యర్థిని ఎంపిక చేసేందుకు సైతం ఏకాభిప్రాయం రాక పోవడమే తాత్సరానికి కారణమని తెలుస్తుంది. ఇప్పటికే ప్రధాన విపక్షమైన బిఆర్ఎస్ అభ్యర్థిని ఎంపిక చేసి నియోజక వర్గాలు, మండలాల్లో తొలి దశ ప్రచారాన్ని పూర్తి చేశారు. బిజెపి అభ్యర్థి సైతం ప్రచారంలో ఉన్నారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థినిని ఎంపిక చేయకపోవడం కాంగ్రెస్ క్యాడర్‌లో భిన్నాభిప్రాయాలకు తావిస్తుంది. మంత్రుల అనుచరులు ఏర్పాటు చేసుకున్న సామాజిక మాధ్యమాలలో ఒకరిపై ఒకరు ఎత్తిపొడుపులు, వ్యంగ్యాస్త్రాలు ప్రచారం చేసుకుంటూ క్యాడర్‌లో బేధాభిప్రాయాలను తీసుకు వచ్చేందకు ప్రయత్నం చేస్తున్నారు. మరింత తాత్సారం జరిగితే కాంగ్రెస్‌కు గెలుపొటముల సంగతి ఎలా ఉన్న అంతర్గతంగా ఇబ్బందులు తలెత్తి నష్టం జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఊపు కాస్త తగ్గినట్లుగా కనిపిస్తుంది. నవంబరు నాటి పరిస్థితులు ఇప్పుడు జిల్లాలో లేవన్నది వాస్తవం. ముఖ్యంగా రుణ మాఫీ, రైతు బంధు, నగదు బదిలీ పథకాల పట్ల కొంత పెదవి విరుపు కనిపిస్తుంది. అధిష్టానం అభ్యర్థి ఎంపిక తర్వాత పరిస్థితులు ఏవిధంగా ఉంటాయి, తిరిగి కాంగ్రెస్ జోష్‌లోకి వస్తుందా, స్థానికేతరులైతే దాని ప్రభావం ఎలా ఉంటుంది అనే దానితో పాటు సామాజిక వర్గ ప్రభావం కూడా ఈసారి ఎన్నికలపై ఉండే అవకాశం ఉంది.

# 18 నుంచి నామినేషన్ల స్వీకరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 18 గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి విపి గౌతమ్ సమావేశం ఏర్పాటు చేసి నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఈనెల 21 ఆదివారం మినహాయించి మిగిలిన ఏడు రోజులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలు మాత్రమే అనుమతించబడునని మిగిలిన వాహనాలు 100 మీటర్ల దూరంలో ఉండాలని ఆయన తెలిపారు. నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో ఒకేసారి ఐదు గురికి మాత్రమే అనుమతి ఉందని ఆయన తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రపోజల్, గుర్తింపు పొందని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ప్రపోజర్లు ఉండాలన్నారు. పోటీ చేయు అభ్యర్థులు దేశంలో ఎక్కడైనా ఓటు హక్కు కలిగి ఉండ వచ్చునని ప్రపోజర్లు ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలని ఆయన తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో ముద్రణకు చిహ్నాలు ఎన్నికల సంఘం నుండి వస్తాయని ఫోటోల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 26న స్క్రూటీ ప్రక్రియ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులకు కలెక్టరేట్‌లో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి లేటెస్ట్ నామినేషన్ పత్రం ప్రింట్, అఫిడవిట్ పత్రాలు అందుబాటులో ఉంచినట్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నామినేషన్ ఫారం 2ఎ లో, అఫిడవిట్ ఫారం 26 లో సమర్పించాలన్నారు. అఫిడవిట్ లో అన్ని కాలాలు పూర్తి చేయాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు విషయమై తాజా బ్యాంక్ ఖాతాలు తెరవాలని, ఎన్నికల సంబంధ లావాదేవీలన్ని ఈ ఖాతా ద్వారానే జరపాలన్నారు. అభ్యర్థికి రూ. 25వేల సెక్యూరిటీ డిపాజిట్, ఎస్సి, ఎస్టి అభ్యర్థులైతే రూ. 12,500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని రకాల అనుమతుల కొరకు సువిధ సింగిల్ విండో ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు చెక్‌లిస్ట్ అందజేసి దాని ప్రకారం సిద్ధం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, జెడ్పిసిఈవో వినోద్, డిటివో సత్యనారయణ, ఎల్‌డిఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా శ్రీరామ నవమి పనులు

**(మొదటిపేజీ తరువాయి)**



చేశారు. సామాన్య భక్తులు సైతం స్వామివారి కళ్యాణోత్సవాన్ని కనులారా తిలకించేందుకు ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సెక్టార్లలో వేసవి తాపం నుండి బయట పడేందుకు జంభో కూలర్లను సెక్టార్‌కు రెండేసి చొప్పున సిద్ధం చేశారు. కళ్యాణ మండపాన్ని సర్వాగం సుంధరంగా తీర్చి దిద్దారు. ఇప్పటికే పచ్చని రాతి పందిరికి పాలీష్ వేశారు. మండపం చుట్టూ చల్లగా ఉండేందుకు వెదురు తడికలు చుడుతున్నారు. వాటికి రంగురంగుల వస్త్రాలను అమర్చుతున్నారు. పట్టణంలో ప్రతీ కూడలి వద్ద భక్తుల కోసం తలంబ్రాల కౌంటర్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో లడ్డూ ప్రసాదాల కౌంటర్లు సిద్ధం చేస్తున్నారు. భక్తులందరికీ స్వామివారి ప్రసాదం అందేలా సుమారు రెండు లక్షల లడ్డూను సిద్ధం చేస్తున్నారు. ఏడు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేవస్థానంతో పాటు అయ్యప్ప స్వామి ఆలయం, సాయిబాబా అన్నదాన సత్రం, క్షత్రియ సత్రం, ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం వద్ద భక్తులు అన్నప్రసాదాన్ని అందించనున్నారు. ఆర్టిసి బస్టాండ్, కళ్యాణ మండపం, గోదావరి స్నానఘట్టాలు, విస్తా కాంప్లెక్స్ వద్ద తాత్కాలిక మరుదగుదొడ్ల సదుపాయాన్ని కల్పించారు. విస్తా కాంప్లెక్స్, గోదావరి ఘాట్ వద్ద ఉచిత వసతి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఆంజనేయ పార్కు, ఆర్‌టిసి బస్టాండ్, గోదావరి ఘాట్, కళ్యాణ మండపం విస్తా కాంప్లెక్స్, కూనవరం రోడ్‌లో ప్రాథమిక చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లతోపాటు కళ్యాణ మండపంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంచినీటి పంపులు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పలు చోట్ల అత్యవసర చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రాచలం రాముల వారి కళ్యాణానికి టిఎస్ ఆర్టిసి వారు సుమారు 400 బస్సులను తిప్పుతున్నారు.

**విద్యుత్ కాంతులు ...**

నవమి సందర్భంగా భద్రాచలం రామాలయం పరిసరాలు సర్వాంగ సుంధరంగా తయారయ్యాయి. రామాలయం పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాల కాంతులతో మెరిసిపోతున్నాయి. దీంతో పట్టణంలో పండుగ శోభ ఉట్టిపడుతోంది. సాయంత్రం వేళల్లో పలువురు ఆలయ పరిసరాల వద్దకు చేరుకుని విద్యుత్ దీపాల కాంతుల నడుమ సెల్ఫీలు తీసుకునేందుకు మక్కువ చూపుతున్నారు. అందే విధంగా పట్టణంలో గోదావరి నదిపై ఉన్న రెండు వంతెనలకు విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. ఆంజనేయ పార్కు, అయ్యప్ప స్వామి ఆలయం, అభయాంజనేయ స్వామి ఆలయంలో పాటు పట్టణ ప్రధాన రోడ్డుకు ఇరువైపుగా ఉన్న దుకాణ సముదాయాలను సైతం విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. రాముడు నడయాడిని ప్రాంతం ఈ పండుక వేళ ధగాధగా మెరిసిపోయాలే ముస్తాబు చేస్తున్నారు.

# సినిమా చూపిస్తున్న బినామీ

**-పెద్దిపల్లి ఇసుక ర్యాంపుకు ప్రైవేటు సైన్యం పహారా**
**-ఫ్లడ్ లైట్ల వెలుగులు**



**ప్రజాపక్షం/ చర్ల :** పెద్దిపల్లి ఇసుక ర్యాంపులో ఓ బినామీ కాంట్రాక్టర్ గతేడాది నుండి అధికారులు, పాత్రికేయులు, ప్రజలకు సినిమా చూపిస్తున్నాడు. ప్రత్యేకించి గిరిజనుల పట్ల వ్యవహరిస్తున్న తీరు తీవ్ర వివాదస్పదమవుతుంది. గతంలో బోయపాటి వినయ విదేయ రామ అన్న బినామీ ఇప్పుడు సరి కొత్త సినిమాకు తెర లేపాడు. పెద్దిపల్లి ఇసుక ర్యాంపులో గతేడాది నుంచి 1.79 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీయడానికి అనుమతులు వచ్చాయి. ఇసుకను తోడి రవాణా చేసేందుకు సాండ్ కమిటీని ప్రసన్నం చేసుకున్న బినామీ కాంట్రాక్టర్ అధికారులను, సొసైటీ సభ్యులను ఊహా లోకంలోకి తీసుకెళ్లి సినిమా చూపిస్తున్నాడన్న ప్రచారం జరుగుతుంది. గతేడాది నుంచి ఇసుక ఎగుమతులు చేస్తున్న ఈ బినామీ ఈ ఏడాది రెచ్చిపోయి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. చర్ల మండలంలో ఎనిమిది ఇసుక ర్యాంపులు ఉండగా ఏ ఇసుక ర్యాంపులో లేని వివాదాలు పెద్దిపల్లి ఇసుక ర్యాంపులోనే చోటు చేసుకోవడం అటు అధికారులకు, ఇటు సొసైటీ సభ్యులకు తలనొప్పిగా మారింది. అధికారులు బినామీ కాంట్రాక్టర్ నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతూ అక్రమాలను దాచి పెడుతున్నారని ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. అవినీతి అధికారుల అండతో బినామీ కాంట్రాక్టర్ కొంత మంది ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని ఎవరైనా ఇసుక ర్యాంపు వైపు వస్తే దాడులు చేసేందుకు వెనుకాడడం లేదు. దీనితో పెద్దిపల్లి ర్యాంపు వైపు చూసేందుకు జంకుతున్నారు. గోదావరి ఇసుక తరలింపు చరిత్రలో ఏ బినామీ కాంట్రాక్టర్ కూడా ఈ స్థాయిలో బెదిరింపులకు పాల్పడలేదన్న ప్రచారం జరుగుతుంది. ఇక పోలీసులు సైతం ఈ బినామీకి ఎస్ సార్ అంటున్నారు. ఎవరైనా ఈ బినామీ పై ఫిర్యాదు చేస్తే ఫలానా వ్యక్తి ఫిర్యాదు చేశాడంటూ కాంట్రాక్టర్‌కే ఫోన్ చేసి సమాచారం ఇవ్వడమే కాకుండా ఫిర్యాదును బుట్టదాఖలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎవరైనా ప్రయాణికుడు మణుగూరు నుంచి చర్లకు వచ్చే క్రమంలో పడవ పై గోదావరిని దాటితే ఆ ర్యాంపు ఫోటోలు తీస్తారని కొందరిని కాపాల పెట్టి సెల్‌ఫోన్లు బయటకు తీయ్యకుండా దౌర్జన్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గోదావరి గర్భం నుంచి యంత్రాలు తోడు ఇసుక చిత్రాలు తీయ్యకుండా అడ్డుకుంటున్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురు ఏర్పాటు చేసి రాత్రిపూట సైతం ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇన్ని అక్రమాలకు పాల్పడుతున్న బినామీ కాంట్రాక్టర్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. ఓ ఉన్నతాధికారిని ఈ విషయమై కొందరు ప్రశ్నిస్తే మీరు ఫిర్యాదులు చేయండి వార్తలు రాయించండి మాకు ఇవ్వాల్సినవే ఇవ్వడం లేదు మీరు ఫిర్యాదు చేస్తేనే దారికి వస్తాడు అని వ్యాఖ్యానించారంటే పెద్ది పల్లి ర్యాంపు నిర్వహణ అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది.

# విజేతలకు బహుమతులు అందించిన కలెక్టర్




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ బహుమతులను సోమవారం అందజేశారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి ఒకటి వరకు చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులను అందజేశారు. పోస్టర్ తయారీ విభాగంలో ఖమ్మం వరంగల్ క్రాస్ రోడ్డులోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని సపూరా రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి పొందారు. ఇట్టి బహుమతికి సంబంధించిన సర్టిఫికెట్‌ను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తన చాంబర్‌లో విద్యార్థిని సపూరాకు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం శ్రీనివాసరెడ్డి, డిఈవో సోమశేఖర శర్మ, ఆర్‌ఎంవో రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమికి గట్టి బందోబస్తు : ఎస్‌పి



ప్రజాపక్షం/భద్రాచలం : 17న జరిగే శ్రీరామ నవమికి గట్టిబందో బస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక ఏఎస్‌పి కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అంతా కేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వర్తించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు.

# మధిర మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- కాల్వల నుండి వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మున్సిపాల్టీలో పలు వార్డుల్లో ఎక్కడ చూసినా చెత్తచెదారం దర్శనమిస్తుంది. గత కొన్నిరోజులుగా సైడ్ డ్రైనేజి కాల్వలను తీయక పోవడంతో కాల్వల నుండి వస్తున్న దుర్గంధంతో పట్టణ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. మున్సిపాల్టీలో ప్రధాన కూడళ్లల్లో, వైరా ప్రధాన రహదారి, ప్రజాప్రతినిధుల వార్డుల్లో మాత్రమే పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తూ మిగితా వార్డుల్లో తూ.. తూ.. మంత్రంగా పారిశుద్ధ్య, కాల్వల పూడికతీత పనులు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల మధిర మున్సిపాల్టీ అధికారులు ఇంటి పన్నులు, ఇత రపన్నులను ముక్కుపిండి వసూళ్లు చేశారని, కాని మధిర మున్సిపాల్టీలో పారిశుద్ధ్యం, శానిటేషన్, ఇతర కార్యక్రమాలు నిర్వహించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గతంలో మున్సిపల్ సిబ్బంది వీధుల్లోకి వచ్చినప్పుడు అక్కడ నివాసం ఉండే వారి దగ్గర నుండి వీధిని శుభ్రం చేసిన క్లియరెన్స్ కోసం సంత కాలు తీసుకునే వారని, ఇప్పుడు అలాంటి పద్ధతికి స్వస్తి పలకటంతో మున్సిపాల్టీ సిబ్బంది పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని ప్రజలు విమర్శిస్తున్నారు. అన్ని వీధుల్లో చెత్తసేకరించే బండి రావటం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే మధిర మున్సిపాల్టీ మెయిన్‌రోడ్డులోని వినాయకుడి గుడి సెంటర్‌లో ఇంతవరకు సైడ్ కాల్వలు ఏర్పాటు చేయకపోవడం కోసమెరుపు.



మున్సిపాల్టీ నిబంధనల ప్రకారం అన్ని ప్రధాన రహదారుల్లో సైడ్ కాల్వలను నిర్మించాల్సి ఉన్నప్పటికీ ఇక్కడి పాలకవర్గం ఏ మాత్రం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో సైడ్ కాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్ల మీద చెరి చెరువుల్లా తలపిస్తున్నాయని, అదుగు తీసి అదుగు వేసే పరిస్థితి లేదని దుకాణాదారులు వాపోతున్నారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి 6వ వార్డులో నెలరోజులుగా చెత్తబండి రావటం లేదని, సైడ్ కాల్వలు తీయటం లేదని ఆ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వార్డులో ప్రజలు కాల్వలు తీసుకునే పరిస్థితి వచ్చిందని, 7వ వార్డులో కాల్వలు లేక మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ మండల నాయకులు అన్నవరపు సత్యనారాయణ తెలిపారు. మధిర మున్సిపాల్టీలో ఎక్కడా చూసిన అధ్వాన్నంగా డ్రైనేజి వ్యవస్థ, చెత్తచెదారం పేరుకుపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మధిర మున్సిపాల్టీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలను విధిగా నిర్వహించి మున్సిపాల్టీ ప్రజలకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో గ్రాడ్యుయేషన్ డే



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదవ తరగతి విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాలను అందించారు. నర్సరీ నుంచి మొదలుకుని ఎనిమిదేళ్లుగా వివిధ తరగతులను అభ్యసించి ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టాలు అందుకుని సంబరంగా గడిపారు. వివిధ ఒలంపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా తమ పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించామని తెలిపారు. ప్రతి ఏడాది ఇన్‌స్పైర్ సైన్స్ ఎక్స్‌పో తో పాటు క్రీడలు, సాంస్కృతిక పర్వదినాల నిర్వహణ, మహనీయుల జయంత్యోత్సవాలు, స్కూల్ డే నిర్వహణ తదితర అన్ని విషయాలతో పాటు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తమకు విద్యార్థుల తల్లిదండ్రులు అనునిత్యం వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహించినట్లు తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీల సంఖ్య మరింత పెంచాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల కూలీల సంఖ్య ను మరింత పెంచాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని సుర్దేపల్లి పంచాయతీ లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సోమవారం పరిశీలించారు. కూలీల మస్టర్ ను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తాగునీటి, నీడ సౌకర్యం కల్పించారు.అనంతరం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఉపాధి హామీ పథకం పనులకు మరింత మంది కూలీలు వచ్చేలా చూడాలని ఆదేశించారు.వారికి నీడ, తాగు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. పని ప్రదేశం వద్ద ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలని ఆదేశించారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, టీఏ శైలజా తదితరులు పాల్గొన్నారు.

# గొంతెండుతున్న గిరిజన గ్రామాలు..!

- వట్టిపోయిన నీటి వనరులు
- నీటి కోసం నానా ఇబ్బందులు







ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని గట్టుమల్ల పంచాయతీ క్రాంతి నగర్ గ్రామం నందు మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. మండల పరిధిలోని ఈ గ్రామం గత 35 ఏళ్ల క్రితం నిర్మించబడింది. నాటి నుండి నేటి వరకు గ్రామ ప్రజలు త్రాగునీరు సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది అధికారులు బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్న ఈ గ్రామ ప్రజల దాహార్తిని తీర్చే నాథుడే కరువయ్యాడు. లక్ష్మీ దేవిపల్లి మండలం పూర్తి ఏజెన్సీ మండలం 1/70 చట్టం అమలులో ఉన్న గిరిజనులకు తగు ప్రాధాన్యత లేకపోవడం ఆశ్చర్యం. గిరిజనాభివృద్ధి సంస్థ ఐటిడిఏ అతి చెరువులో ఉన్న ఈ ఏజెన్సీ గ్రామాల్లో త్రాగునీటి సాగునీటి సమస్యలు తీరడం లేదు. ఈ గ్రామం నందు 200 పైచిలుకు మంది ప్రజలు జీవిస్తున్న వారి బాగోగులను చూసే అధికారులే కరువయ్యారు. మంచినీటి కోసం గ్రామప్రజలు కొన్ని మైళ్ళ దూరం వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న సంఘటనలు ఉన్నాయి. మానవ జీవితంలో మంచినీరు ఎంతో అవసరమైంది. అటువంటి అవసరాలు తీర్చుకోవడం కోసం గ్రామప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణ రహితంగా ఉన్నాయి. గ్రామంలో గర్భిణీలు, వికలాంగులు సైతం తమ మంచినీటి అవసరాన్ని తీర్చుకోవడానికి కొన్ని మైళ్ళ దూరం వెళ్లాల్సి వస్తుంది. ప్రతి ఏటా వచ్చే వేసవికాల సమయంలో మంచినీటి కొరకు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల దాహార్తిని తీర్చుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాములోరి కళ్యాణానికి సర్వం సిద్ధం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పరమ భక్తగ్రేసరుడు కంచర్ల గోపన్న (రామదాసు ) ధ్యాన మందిరం శ్రీరాములోరి కళ్యాణం కు సర్వం సిద్ధమైంది. పట్టణం కు చెందిన 60 మంది భక్తులు సోమవారం మందిరం లోని గోటి తలంబ్రాలు తయారు చేశారు. తొలుత పసుపు ను కొట్టి తలంబ్రాలను సిద్ధం చేశారు. భద్రాచలం దేవస్థానం అందించే తలంబ్రాల తో పాటు స్థానిక భక్తులు తయారు చేసిన తలంబ్రాలను కలిసి కళ్యాణంలో వినియోగించనున్నారు. శ్రీరామ నామంతో మహిళ భక్తులు మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మందిరం అర్చకుడు సౌమిత్రి రమేష్ పూజా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా ఎన్నికల కోడ్ పేరు తో భద్రాచలం కళ్యాణం ను ప్రత్యక్ష ప్రసారం చేయటం భాధకరమని, భక్తుల మనోభావాలను అర్థం చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు పసుమర్తి శ్రీనివాస్ కోరారు. ప్రత్యక్ష ప్రసారం చేయాలని కోరారు.

## గేదెను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు



ప్రజాపక్షం/సుజాతనగర్: సుజాత నగర్ మండలంలోని వేపలగడ్డ గ్రామానికి చెందిన జంగిలి నాగేశ్వరరావు గేదెను ఆర్టీసీ బస్సు సోమవారం ఢీ కొట్టింది. వేపల గడ్డ గ్రామంలో రామాలయ సమీపాన గేదె రోడ్డు దాటుతుండగా ఖమ్మం నుండి కొత్తగూడెం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. గేదె విలువ సుమారు ఒక లక్షా 50 వేల రూపాయలు ఉంటుందని, జీవనాధారమైన పాడి గేదె తీవ్ర గాయాలు అవ్వడంతో తమకు న్యాయం చేయాలంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఆదివాసీ పిల్లలకు బట్టల పంపిణీ



ప్రజాపక్షం/ములకలపల్లి: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు గ్రామాలలోని వలస ఆదివాసీ పిల్లలకు బట్టల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. తిమ్మంపేట యూపీఎస్ ప్రధానోపాధ్యాయులు శంకర్ ఆధ్వర్యంలో బండారుగూడెం ఎంపిపిఎస్ స్కూల్‌లో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తిమ్మంపేట పాఠశాల దాత జలగం లీలా సంతోష్‌కుమార్ బాల్య స్నేహితుడు విష్ణుప్రసాద్ ఈ బట్టలను అందజేసినట్లు శంకర్ తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా విద్యను అభ్యసిస్తున్న వారికి సహాయం చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తిమ్మంపేట పాఠశాలకు దాతలు అందజేసిన వాటిల్లో ఇక్కడ అవసరాలు తీరిన తరువాత అత్యంత మారుమూల గ్రామాలను ఎంచుకొని వారికి వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : సహచర విద్యార్థి అనారోగ్యం తో భాదపడుతున్న విషయం తెలుసుకున్న స్నేహితులు స్పం దించారు. మండల కేంద్రం కు చెందిన ప్రభుత్వ పాఠశాల 198489 పదో తరగతి కి చెందిన విద్యార్థి బీ.సాంబశివరావు ఇటీవల అనారోగ్యం తో మంచం పట్టారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబానికి అవసరమైన నిత్యవసర సరుకులు అందించారు. సాంబశివరావు కు అండగా ఉంటామని భరోసా కల్పించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు రేలా నరసింహారెడ్డి, ఎండీ వాజీద్, గుడిబోయిన వెంకన్న పాల్గొన్నారు.

## వరిగడ్డి వామి దగ్ధం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం కృష్ణయ్య బంజర గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీనివాసరావుకు చెందిన వరిగడ్డి వాము ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సత్తుపల్లి అగ్నిమాపక కేంద్రం వారు, గ్రామస్తులు మంటలను అదుపులో తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పసుపులేటి శ్రీనివాసరావును పరామర్శించారు.

## మట్టా దయానంద్ పరామర్శలు



ప్రజాపక్షం/సత్తుపల్లి రూరల్: సత్తుపల్లి పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మదపాటి శ్రీను (టోపి శ్రీను) సతీమణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మం డల పరిధిలోని కిష్టాపురం గ్రామం లో సోమవారం జరిగిన కీ.శే. ఖమ్మంపాటి కృష్ణయ్య దశదిన కర్మ కార్యక్రమానికి మట్టా దయానంద్ హాజరై వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్‌తో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆర్టిసి రవాణా ఏర్పాట్లు

**-238 ప్రత్యేక బస్సులు**
**-ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 17న భద్రాచలం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న తెలిపారు. ఈనెల 17న సీతారాముల కళ్యాణ మహోత్సవ సందర్భంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా డిపో మేనేజర్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులతో సోమవారం ఖమ్మం నూతన బస్టాండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం వెంకన్న మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భద్రాచలం వచ్చే అవకాశం ఉన్నందున గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎటువంటి రవాణా సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మొత్తం 238 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని ప్రధాన బస్టాండ్ల నుంచి ఏప్రిల్ 16 నుండి 18 వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందని తెలిపారు. డిపో మేనేజర్లు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ అత్యున్నతమైన సేవలను అందించాలన్నారు. డిపో మేనేజర్లకు దిశా నిర్దేశం చేశారు. భద్రాచలం బస్టాండ్ నుంచి పర్ణశాల వరకు ప్రస్తుతం నడుస్తున్న రెగ్యులర్ సర్వీసులతో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు నడిపేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఖమ్మం రీజియన్ నుండి ప్రస్తుతం నడుస్తున్న రెగ్యులర్ సర్వీసులతో పాటు ప్రత్యేక బస్సు సర్వీసులను భద్రాచలం బస్ స్టేషన్ వరకు నడపబడతాయని ఆయన తెలిపారు. మహిళలకు ఆ బస్సులో ఉచిత ప్రయాణం అనుమతించబడుతుందని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందుల నివారణ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రెగ్యులర్ సర్వీసులు, ప్రత్యేక సర్వీసులన్ని భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్ వరకు మాత్రమే అనుమతించబడతాయని ఆర్ఎం తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి భద్రాచలం బస్టాండ్ వరకు మినీ బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. మినీ బస్సులలో మహా లక్ష్మి పథకం వర్తించబడుతుందని, ఇతర ప్రయాణికులకు ఒక్కొక్కరికి రూ.10లు నామ మాత్రపు ఛార్జీ ఉంటుందని ఆయన తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 40 మంది సెక్యూరిటీ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ప్రయాణికులకు తాగునీటితో పాటు ఇతర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా బస్సుల నిర్వహణకు అధికారులను నియమించినట్లు తెలిపారు. భద్రాచలం పరిధిలో మధిర డిపో మేనేజర్ 9959225961, భద్రాచలం డిపో మేనేజర్ 9959225960, పర్ణశాల వద్ద మణుగూరు డిపో మేనేజర్ 9959225963, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం భద్రాచలం వద్ద సత్తుపల్లి డిపో మేనేజర్ 9959225962, కొత్తగూడెంలో కొత్తగూడెం డిపో మేనేజర్ 9959225959, ఖమ్మంలో ఖమ్మం డిపో మేనేజర్ 9959225958, మణుగూరులో అసిస్టెంట్ మేనేజర్ 7382858121, సత్తుపల్లిలో అసిస్టెంట్ మేనేజర్ 6303561217, మధిరలో సూపరింటెండెంట్ 8790014668 అందుబాటులో ఉంటారని వారిని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భవాని ప్రసాద్, జిఎన్ పవిత్ర, డిపో మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్), అకౌంట్స్ ఆఫీసర్స్, పర్సనల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు తప్పని కష్టాలు..!



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని ఉపాధి హామీలులో పనిచేస్తున్న కూలీలకు గత రెండు నెలల నుంచి కూలి నగదు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉపాధి హామీలో3500 మంది కూలీలు ప్రతి రోజు కూలికి వెళ్తున్నారు కూలికి వెళితేనే పూట గడిచే పరిస్థితి అయితే ఇదే పరిస్థితిలో మండలంలో రెక్కాడితేడొక్కాడని పరిస్థితిలో ఎంతో ఆశతో రోజును గడుపుకుందామని పేద కుటుంబాలు కూలికి వెళ్తే కూలి డబ్బులు గత రెండు నెలల నుంచి రాకపోగా పస్తులు ఉండాల్సి వస్తుంది. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, మర్లపాడు, వెన్నవల్లి, చెన్నూరు, పెద్ద కోరుకొండి, ముచ్చవరం, బత్తులపల్లి, పేరు వంచ, చంద్రుపట్ల, కల్లూరు, తదితర గ్రామాలలో ఉపాధి హామీలో అధికంగా కూలీలు హాజరవుతున్నారు .ఈ పరిస్థితులలో ప్రభుత్వం ప్రతి వారం కూలీలు ఖాతాలలో జమ చేయాల్సి ఉండగా నేటికీ 8 వారాలు పైగా ఖాతాలలో నగదు జమకానందున ఖాతాదారులు కష్టాల్లో పడ్డారు. అసలే పూట గడవని పరిస్థితి ఆపై కూలి అందని పరిస్థితి దీనివలన అయోమయంలో గందరగోళంలో ఆకాశం వైపు చూస్తున్నారు .ఉపాధి హామీ పథకం పై పూర్తిస్థాయిలో నమ్మకం పోతుంది . ఇక వలస బాట తప్పదని ఒకరినొకరు అనుకుంటున్నారు. గ్రామాల నుంచి పట్నాలకు వెళ్తే బాగుంటుందని ఆలోచిస్తున్నారు. ఇదేమని అధికారులను అడగగా ప్రతి వారం కూలీల వేతనాన్ని లెక్కగట్టి ఆన్లైన్లో పొందుపరుస్తున్నామని మేము చేసేది ఏమీ లేదు అని అంటున్నారు. అలా అయితే కూలీకి ఎలా వెళ్లాలి రోజువారి నిత్యవసరాలు ఎలా తీర్చుకోవాలి తీర్చాలి అని ఒకరినొకరు అనుకుంటున్నారు. మండలంలో 8 వారాలు పైగా రోజువారి కూలీలు 3500 మంది కాగా వారికి కూలీల వేతన బకాయిలు 1.10 కోట్లు ఉందని అధికారులు తెలుపుతున్నారు. ఉపాధి హామీ పథకం చట్టాన్ని కొందరు నీరుగారిచేందుకే ఈ విధంగా రోజువారి కూలీలు వేతనాలను ఖాతాలలో వేయడం లేదని పూర్తిగా దీనిపై నమ్మకం పోతుందని వారు గ్రామాలలో కూలీలు ఒకరు నొకరు చర్చించుకుంటున్నారు. ఇక ఈ విధంగా అయితే పల్లె నుంచి పట్నంకు వలస బాట పట్టటమేనని వారు అధికారులకు తేల్చి చెప్తున్నారు.

# మద్యం మత్తులో ఘర్షణలకు పాల్పడొద్దు

**-నిత్యం రాత్రివేళ విస్తృతంగా పెట్రోలింగ్**
**-సింగరేణి సిఐ తిరుపతిరెడ్డి**




ప్రజాపక్షం/కామేపల్లి: మద్యం మత్తులో యువకులు రెచ్చిపోతున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నారు. ప్రధానంగా యువత మద్యం సేవించి వాహనాలు అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మత్తులో యువత దాడులు చేసుకుంటున్నారు. యువత మద్యానికి బానిసై ప్రమాదాలు కొని తెచ్చుకుని తల్లిదండ్రులకు కడుపు కోత మిగులుస్తున్నారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు కోడ్ అమల్లో ఉందని ఎవరైనా సరే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ చర్యలు తప్పవు అన్నారు. మద్యం మత్తులో యువకులు ఘర్షణకు పాల్పడితే సహించేది లేదని చెప్పారు. రాత్రి వేళలో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని తెలిపారు. నిత్యం ప్రధాన రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు.

# క్రీడా ప్రాంగణాలకు క్రీనీడ..!

**-కేవలం బోర్డులకే పరిమితమైన వైనం**
**-కనిపించని ఆట పరికరాలు**
**-కబ్జాదారుల చూపు క్రీడా ప్రాంగణాల వైపు..?**
**-అర్హత ఉన్న క్రీడాకారుల భవిష్యత్తు అధోగతి..**
**-లక్షల్లో నిధులు దుబారా**
**-నెరవేరని అసలు లక్ష్యం**






ప్రజాపక్షం/పినపాక: గ్రామీణ ప్రాంతాల్లోనూ యువతకు ఆటల పట్ల ఆసక్తి కలిగించాలని ఉద్దేశంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఉపాధి హామీ నిధులు గ్రామ సమీపంలోని కనీసం అర ఎకరం ఖాళీ స్థలంలో వీటిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు కోకో, వాలీబాల్, బాస్కెట్ బాల్, సెటిల్, కబడ్డీ తదితర క్రీడలు ఆడేందుకు వీలుగా ఆట పరికరాలు అందుబాటులో ఉంచాలని ప్రతి పంచాయతీలో వీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చేపట్టడంతో అప్పటి అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పనులు పూర్తయిన వాటిలో కూడా మొక్కుబడిగా ఏర్పాటు చేసి కనీస వసతులను మరిచారు. ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి దాదాపు రూ. 2.50 లక్షలు కేటాయించినప్పటికి పలు చోట్ల మైదానం చుట్టు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి కనిపిస్తోంది. ఊరికి దూరంగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడంతో యువత ఆసక్తి చూపక పోవడంతో మందు బాబులకు అండగా మారుతున్నాయి. క్రీడా ప్రాంగణాల్లో ఒక్క రోజు కూడా ఏ ఒక్క క్రీడ నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రభుత్వ సంకల్పం ఆచరణలో విఫలమవుతోందనడానికి గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. క్రీడా ప్రాంగణాల పేరిట పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమవుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో అనువైన స్థలాలను ఎంపిక చేయకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. అప్పటి ప్రభుత్వం అధికారులు ప్రతినెలా సమీక్షించడం, ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేయడం మూలంగా స్కూళ్ళు, గ్రామపంచాయతీ కార్యాలయాలతో పాటు గ్రామంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా అక్కడ బోర్డులు పెట్టేసి అధికారులు నివేదించారు. ఈ క్రీడా ప్రాంగణాలకు ఎక్కడ చూసినా ఫెన్సింగ్ వేసిన దాఖలాలు లేవు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే వీటికి బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పరికరాల కోసం వెచ్చించిన రూ.లక్షల నిధులు దుబారా అయినట్లు కనిపిస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించడంతో 23 గ్రామపంచాయతీల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ప్రాంగణం కోసం 2.50 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. మరి కొన్నిచోట్ల కేవలం క్రీడా ప్రాంగణం అనే పేరుతో బోర్డుపై రాయించి ఎక్కడో చోట బిగించారు. కొన్ని ఊరికి దూరంగా ఉన్నా ఎక్కడ చూసినా ఖాళీ బోర్డులే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలో కబ్జాదారుల చూపు క్రీడా ప్రాంగణాల వైపు ఉన్నట్టుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడలను ప్రోత్సహించి గ్రామాలలో టాలెంట్ ఉన్న ప్లేయర్లను వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యం ఉన్నప్పటికీ అర్హత ఉన్న క్రీడకారుల భవిష్యత్తు అధోగతిగా మారింది. క్షేత్రస్థాయిలో వీటి ఏర్పాటుపై పర్యవేక్షణ చేసి బిల్లు చెల్లించాల్సి ఉండగా, అధికారులు మామూలుగా తీసుకుంటూ అవేవీ పట్టించుకోనట్లు తెలిసింది. వారి పర్యవేక్షణ లేని మూలంగా క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలో లేకపోగా, మండల వ్యాప్తంగా రూ.లక్షల నిధులు దుబారా చేసినట్టు కనిపిస్తోంది. వీటి ఏర్పాటులో అవినీతి చోటుచేసుకుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించి వీటిని బాగు చేయాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

## భక్తులకు పెరుగన్నం పంపిణీ



ప్రజాపక్షం/బూర్గంపాడు: శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణానికి పాదయాత్రగా ఆంధ్రా నుంచి తెలంగాణ నుంచి వస్తున్న భక్తులకు 300 పెరుగన్నం ప్యాకెట్లను ప్రముఖ సంఘ సేవకులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బొల్లు సాంబశివరావు తన సొంత ఖర్చులతో సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అవధూత గుడి ఆశ్రమం వద్ద, సాయి బాబా గుడి వద్ద, బ్రహ్మం గారి గుడి వద్ద పెరుగన్నం పంపిణీ చేవారు. పాదయాత్రగా వస్తున్న తమకు పెరుగన్నం పంపిణీ చేసినందుకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణానికి పాదయాత్రగా వస్తున్న భక్తులకు పెరుగన్నం అందించడంబాధ్యతగాభావించాననిఎంతో సంతృప్తిగా ఉన్నానని పేర్కొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి




ప్రజాపక్షం/బూర్గంపాడు: అంగన్వాడీల పెండింగ్‌లో ఉన్న జీతం, సమ్మర్ హాలీడేస్ ఇవ్వాలని, అదే విధంగా ఇతర బిల్స్ మంజూరు చెయ్యాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ. ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వేర్పుల మల్లికార్జున్‌లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామంలో గల ఐసిడిఎస్ కార్యాలయంలో సమస్యలను పరిష్కరించాలని వారు సిడిపివో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పైన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్కులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్స్‌కు రూ 2లక్షలు, హెల్పర్స్‌కు రూ 1లక్షల, 60 సంవత్సరాలు దాటిన వారికి విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఉత్తర్వుల జారీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకురాలు శ్రీలత, రమాదేవి, విజయలక్ష్మీ, కరుణ, రమణ, రంగమ్మ, గోపోజి దేవమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఓ కార్యాలయంలో నిలిచిన విద్యుత్..!

**- అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర అవస్థలు**
**- ఆన్‌లైన్ సమయం గడుస్తుందేమోనని ఆందోళన చెందిన వైనం**
**- ఎట్టకేలకు రెండు గంటల తర్వాత జనరేటర్ ద్వారా సరఫరా**

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ (బైపాస్‌రోడ్) : ఖమ్మం జిల్లా రవాణాశాఖ అధికారి(ఆర్టీఓ)కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం సాక్షిగా.. సోమవారం 2గంటల(ఉదయ 10నుంచి12 వరకు) సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కార్యాలయంలో పనుల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆన్‌లైన్ సమయం 2గంట వరకే ఉండడంతో పనులు అవుతాయే?లేదో? అని కలత చెందారు. దానికి తోడు కలిగిన అసౌకర్యాలతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఓ పక్క ఎండతాపం..మరో పక్క ఉక్కపోతల నడుమ లైన్‌లో ప్రజలు బారులు తీరారు. ఈ నేపథ్యంలో లైన్‌లో నిలబడలేక మధ్య వయసు కలిగిన వారు,వికలాంగులు,చిన్నపిల్లల తల్లులు అక్కడి అరుగుపైన చెమటలు కక్కుతూ కూర్చుండిపోయారు. అదేవిధంగా పెద్ద వయసు కలిగిన మహిళలు అరుగుపైనే నిద్రించారు. మరికొంతమంది అక్కడే ఉన్న చిన్నపాటి చెట్ల నీడకింద సేద తీరారు. వీరి దాహార్తిని తీర్చేందుకు కనీసం మంచినీళ్లు కూడా లేకపోవడంతో గొంతేండిపోయి గోస పడ్డారు. ఇది కేవలం అధికారుల పట్టింపులేనితనంతో జరగడంపై ప్రజలు పెదవివిరిచారు. అధికారుల తమ పరిస్థితిని ఒక్క క్షణమైన భరిస్తారా..? అని ప్రశ్నించారు.

**ఎట్టకేలకు జనరేటర్‌తో సరఫరా...**

ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకే ఆన్‌లైన్ గడువు ఉండడంతో తమ పనులు అవుతాయే?లేదో? అని ప్రజలు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో అధికారులు ఎట్టకేలకు జనరేటర్ ద్వారా విద్యుత్‌ను పుణరుద్ధరింపచేపించారు. అది కూడా కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఓ ట్రాక్టర్ బ్యాటరీ ద్వారా అందించారు. ఎందుకంటే ఆఫీసులోని జనరేటర్‌ను సరిగ్గ మెయింటినెన్స్ చేయకపోవడంతో ఏర్పడిన సమస్యనేపథ్యంతో. కావున ట్రాక్టర్ బ్యాటరీని తీసి డౌన్ అయిన బ్యాటరీని తొలగించి అక్కడ దానిని ఏర్పాటు చేసి స్టార్ట్ చేశారు. వేల రూపాయాల వెచ్చించి ప్రజాధనంతో ప్రభుత్వం ఇచ్చిన జనరేటర్ మెయింటినెన్స్‌ను అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే సమస్య ఏర్పడిన విషయం తేటతెల్లమయ్యింది.



**ఆన్‌లైన్ ముగిసుంటే అదనపు భారం...**

ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టడంతో వాహనాల వినియోగదారులు ముందుగానే మీసేవలో స్లాట్లు బుక్ చేసుకుంటున్నారు.ఇందులో లెర్నింగ్,రిజిస్ట్రేషన్, ఫ్రెష్‌లైసెన్స్, నేమ్‌ట్రాన్స్ఫర్, పాతలైసెన్సుల రెనివల్స్ కోసం చలాన కట్టి స్లాట్ బుకింగ్ చేసుకుంటారు.వీటిలో రిజిస్ట్రేషన్,నేమ్‌ట్రాన్ఫర్,పాతలైసెన్సుల రెనివిల్స్ ఆన్‌లైన్‌టైంలోపు కార్యాలయంలో నమోదు చేపించుకోవాల్సి ఉన్న తరుణంలో ఒకవేళ అనివార్య కారణాలతో పనులకు ఆటంకం జరిగినపక్షంలో, అధికారులు మోడిఫికేషన్ ద్వారా రెండవరోజు చలాన కట్టించుకోకుండా వాటిని పాస్ చేసే అవకాశం ఉంటుంది. కానీ లెర్నింగ్,ఫ్రెష్‌లైసెన్స్‌లకు ఆ వెసులుబాటు లేదు. ఏరోజు ఆన్‌లైన్‌డేట్ వస్తుందో ఆరోజే కార్యాలయంలోని సంబంధిత కౌంటర్‌లో నమోదు పరుచుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ సరఫరాతో ఏర్పడిన సమస్యతో స్లాట్‌డేట్ రోజున నమోదు కాకుండి ఉండిఉన్నట్లైతే లైసెన్స్ అందకపోగా..అదనపు భారం పడి ఉండేది. మొదటిసారి ఏవిధంగా అయితే ఆన్‌లైన్‌లో చలాన కట్టి స్లాట్‌బుక్ చేసుకున్నారో? మరల అదే పని చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యేది.ఏది ఏమైనప్పటికీ అధికారుల నిర్లక్ష్యపు పొరలను తొలగించుకుని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనఉంది.





# ప్రశ్నాపత్రాలు లీకేజీ చేస్తే షోకాజ్ నోటీసుతో సరిపెట్టడమా..!




-అధికారులకు ఎందుకు
మేరీ ఇమ్మాక్యులేట్ స్కూల్‌పై అంత ప్రేమ
-విద్యార్థుల భవిష్యత్తుకు ఇలాంటి పాఠశాలతో ప్రమాదం



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని శాంతినగర్ సమీపంలో కొణిజర్ల మండల విద్యాశాఖ పరిధిలో ఉన్న మేరీ ఇమ్మాక్యులేట్ స్కూల్‌లో ఇటీవల 6 నుంచి 9 తరగతి వరకు ఎస్సే2 పరీక్షకు సంబంధిం తెలుగు, హిందీ ప్రశ్న పత్రాలు లీక్ అయినవి. దీనిపై కొణిజర్ల మండల విద్యాశాఖ అధికారి విచారణ చేపట్టి జిల్లా విద్యాశాఖకు నివేదిక ఇచ్చారు. మంచిగానే ఉంది. కాని ప్రశ్న పత్రాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లీక్ చేయడం పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఆ స్కూల్‌కి షోకాజ్ నోటీసులు ఇచ్చి సరిపెట్టే సమస్యనా ఇది. ఎందుకు అధికారులు షోకాజ్ నోటీసులు వరకే పరిమితమయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఈ పాఠశాలపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారు. ఒక ప్రశ్నాపత్రం లీకేజ్ అవడం ఎందుకు వెనుకాడుతున్నారు. ఒక ప్రశ్నాపత్రం లీకేజ్ అవడం అంటే ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ఎంతో నెట్‌వర్క్ ఉంటే ఆ ప్రశ్న పత్రాలు లీక్ చేస్తారు. కాని ప్రశ్నా పత్రాలు లీక్ చేసిన పాఠశాలపై నామమాత్రంగా నోటీసులు ఇచ్చి అధికారులు చర్య తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. ఎందుకంటే విద్యార్థుల భవిష్యత్తులో ఆడుకునే విధానానికి తెరలేపి గోప్యంగా ఉంచాల్సిన పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ చేయడం అంటే దీని వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్ ఏమిటి మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో పేపర్ లీకేజి వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది. స్కూల్ యాజమాన్యంతో పాటు ఇంకా ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా, ఎస్సే2 పేపర్ కదా అని తక్కువగా అంచనా వేస్తే పొరపాటే. అసలు ఆ స్కూల్‌లో ఏం జరుగుతుంది, ఆ స్కూల్ నిబంధనలకు ప్రకారమే నడుస్తుందా. ప్రభుత్వం నిబంధనలు అన్ని సక్రమంగా ఉన్నాయా అనేది కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి పూర్తిస్థాయిలో మేరీ ఇమ్మాక్యులేట్ స్కూల్‌పై చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఏ పాఠశాలలో గాని ఎక్కడ ఇలాంటి లీకేజి వ్యవహారం జరగకుండా ఉండేవిధంగా గుణపాఠం చెప్పే విధంగా విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయకుండా ఉండేవిధంగా పాఠశాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పలువురు విశ్లేషకులు అంటున్నారు.

# మార్వాడి యూనివర్సిటీ అడ్మిషన్ ఆఫీస్ ప్రారంభం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో గుజరాత్ రాష్ట్రంలోని మార్వాడి యూనివర్సిటీ కి సంబంధించి అడ్మిషన్ ఆఫీసును ప్రారంభించారు. సోమవారం ఖమ్మం నగరంలోని నెహ్రూ నగర్‌లో గల సిపిఐ పాత కార్యాలయం కాంప్లెక్స్‌లోని నాల్గవ అంతస్తులో ఏర్పాటు చేసిన మార్వాడి యూనివర్సిటీ అడ్మిషన్ ఆఫీస్‌ను యూనివర్సిటీ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీర్ రాజేష్‌కుమార్ పటేల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ మార్వాడి యూనివర్సిటీ దేశంలోనే 23వ స్థానంలో నిలిచిందన్నారు. న్యాక్ ఎ ప్లస్ గుర్తింపు పొందిందన్నారు. అదేవిధంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పొంది 53 దేశాల విద్యార్థులు యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. మార్వాడి యూనివర్సిటీలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యా సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే విధంగా యూనివర్సిటీలో ఫీజులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 50 శాతం మార్కులు పొందిన విద్యార్థులు యూనివర్సిటీలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. మార్వాడి యూనివర్సిటీలో డిప్లొమా, బిటెక్, ఎంబిఏ, ఫార్మసీ, బియస్సీ అగ్రికల్చర్, ఫిజియోథెరపి, ఎల్‌ఎల్‌బి తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా, తెలంగాణ ఇంచార్జి మహేంద్ర నాయుడు, వెంకట వినయ్, భాను, ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ వెంకీ నాయుడు, చరణ్, తిరుమలరెడ్డి, దివ్య బాలినేని తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7799467788, 8886661866 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# త్రివేణి విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: పిడిఎస్‌యు



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** త్రివేణి ప్రైవేటు విద్యాసంస్థలో హాస్టల్‌లో ఉంటూ ఏడో తరగతి చదువుతున్న దారావత్ విక్రంసింగ్ అనే విద్యార్థిని చితకబాదిన పాఠశాల ఉపాధ్యాయుడిని బయటకు రానీయకుండా విషయాన్ని కప్పి పెట్టిన విద్యాసంస్థల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాంపెల్లి పృథ్వీ డిమాండ్ చేశారు. గత నాలుగు రోజుల క్రితం విక్రంసింగ్ అనే విద్యార్థిని చితకబాది విషయం బయటకు చెప్తే ప్రతిరోజు ఇలాగే కొడతానని బెదిరించి విద్యార్థిని భయభ్రాంతులకు గురిచేశాడు. నాలుగు రోజులుగా విషయం బయటకు రాకుండా ఉన్నప్పటికి పాఠశాలలో చదువుతున్న ఇతర విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు తెలియడంతో వెళ్లి విషయం తెలుసుకోగా నాలుగు రోజుల తర్వాత కూడా శరీరంపై ఎర్రటి దద్దులు, వాతలు పడి ఉన్న విద్యార్థి శరీరాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. లక్షల్లో హాస్టల్, స్కూల్ ఫీజులు చెల్లిస్తుంటే మా కుమారుడని ఎందుకు కొట్టారని యాజమాన్యాన్ని నిలదీయడంతో ఉపాధ్యాయులతో వీడియోలు తీయించి తల్లిదండ్రులను సైతం బెదిరింపులకు గురిచేశారు. ఇంత దుర్మార్గంగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రవర్తిస్తుంటే విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థల నిర్వహణ పట్ల గాని, విద్యార్థుల యోగక్షేమాల పట్ల గాని అధికారులకు ఏ మాత్రం పట్టింపు లేకుండా ఉండడంలో అర్థం ఏమిటని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నించారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రవర్తించే తీరును కనీసం నోరు మెదిపి మాట్లాడలేని అధికారుల వైఖరి మూలంగా ఇలాంటి దుశ్చర్యలు ప్రైవేటు విద్యాసంస్థల్లో జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు స్వేచ్ఛగా నిర్భయంగా పాఠశాలలకు వెళ్లి చదువుకోవాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతుంటే వాటిని ఉల్లంఘించి మరోపక్క ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులను ఫీజుల పేరుతో వేధింపుల గురిచేయడం, చిన్న చిన్న పొరపాట్లకు విద్యార్థులను నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేయడం లాంటి సంఘటనలు జరుగుతున్న జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదని వారు అన్నారు. తక్షణమే కొత్తగూడెం త్రివేణి విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.

# ఆర్‌జిపిఆర్ఎస్ బలోపేతానికి కాంగ్రెస్ కృషి

## కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సోనియా గాంధీ స్థాపించిన ఆర్‌జిపిఆర్ఎస్ బలోపేతానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్‌జిపిఆర్ఎస్ జోనల్ కన్వీనర్ మహ్మద్ జావిద్ తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో పంచాయితీరాజ్ శాఖ పరిధిలో గల ప్రజాప్రతినిధులకు ఆర్‌జిపిఆర్ఎస్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌జిపిఆర్ఎస్ రాష్ట్ర ఇంచార్జి కిరణ్ మూగబాస్, రాష్ట్ర కన్వీనర్ రాచమళ్ల సిద్దేశ్వర, పిసిసి సెక్రటరీ కాసపాక రాజేష్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ పంచాయితీ రాజ్ సంఘటన్ అనేది అట్టడుగు స్థాయి ప్రజలకు రాజకీయ అవకాశాలు విస్తరం చడంతో పాటు పంచాయితీరాజ్ సంస్థ లను స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం చేయడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ సారధ్యంలో ఆర్‌జిపిఆర్ఎస్‌ను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. ఆర్‌జిపిఆర్ఎస్‌తో పంచాయితీరాజ్ ఇనిట్యూషన్స్, అర్బన్ లోకల్ బాడీ ప్రతినిధులతో అధికార వికేంద్రీకరణ, అక్షరాస్యత పెంపొందించడం, ఇతర కార్యక్రమాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. తెలంగాణలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసిన విధంగా దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐదు న్యాయాలను అమలు పరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు కమర్తపు మురళి, గజ్జల లక్ష్మి, రఫిదా ముస్తఫా, రావూరి కరుణ సైదబాబు, వడ్డె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భట్టిని విమర్శించే స్థాయి కమల్‌రాజుకు లేదు



**ప్రజాపక్షం/ మధిర :** డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను విమర్శించే అర్హత జెడ్పి చైర్మన్ లింగాల కమల్ రాజుకు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ విమర్శించారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమల్‌రాజు అంటేనే కమీషన్ల రాజు అని, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసిన కమల్‌రాజును ప్రజలు ఓడించి బుద్ధి చెప్పినా సిగ్గులేకుండా స్థాయి మరచి మాట్లాడుతున్నాడని, నోరును అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. సిపిఎం పార్టీలో ఉన్నప్పుడు నీ ఆర్థిక పరిస్థితికి జెడ్పి చైర్మన్‌గా ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితి చూస్తేనే ఎంత కమీషన్లు వసూలు చేశావో ప్రజలకు అర్థమవుతుందన్నారు. లింకు రోడ్లకు, ఔటర్ రింగ్ రోడ్డుకు తేడా తెలియని నీవు డిప్యూటీ సిఎం భట్టిని విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. డిప్యూటీ సిఎం భట్టి సారధ్యంలో జరుగుతున్న మధిర అభివృద్ధిని చూసి తట్టుకోలేకనే లేనిపోని నిందలు వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని, లేనిపక్షం జరిగే పరిణామాలకు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, మండల యూత్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్, నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరి వంశీకృష్ణ, షేక్.బాజీ, ఆదిమూలం శ్రీనివాసరావు, మైలవరపుచక్రి పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలం జికె బంజర గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులతో రఘునాథపాలెం ఎంపిపి భూక్యా గౌరి లాల్యా, బానోత్ భీమ్లా ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నుండి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన బానోత్ బాలాజీ, బదావత్ రవి, ఇరుకు రామయ్య, భూక్యా పరమయ్య, మాలోత్ హట్యా, మాలోత్ రమేష్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో భూక్యా శ్రీను, మాలోత్ నారాయణ, బోడా లాల్ సింగ్, పెనుగొండ రాజు, బోడా బావ్‌సింగ్, బనోత్ చిన్న, రాము, సంతు, పరశురాం, శివ్లా తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సానుభూతి పరుడు బాబూరావు మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఐ సానుభూతిపరుడు వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన చేబోలు బాబూరావు (48) వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. బాబూరావుకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఐదేండ్ల క్రితం మృతి చెందింది. బాబూరావు తండ్రి చేబోలు చలపతి సిపిఐ పార్టీ సీనియర్ నాయకులుగా పనిచేశారు. రెండేళ్ల క్రితం చలపతి కూడా మృతి చెందారు. బాబూరావు సిపిఐ పార్టీ నిర్వహించే పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. ఆయన మృతిపట్ల సిపిఐ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

# తప్పుడు రిజిస్ట్రేషన్‌లే డాక్యుమెంట్ రైటర్ల లక్ష్యం




**-నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేపించడంలో కీలకం**
**-పెద్ద ఎత్తున తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించిన ఘనత వారిదే**
**-అమ్మపాలెంలో పెద్ద ఎత్తున తప్పుడు రిజిస్ట్రేషన్లు**

**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో తప్పుడు రిజిస్ట్రేషన్‌లకు కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు పునాది వేస్తున్నారు. బాలాజి డాక్యుమెంటరీ కన్సల్టెన్సీ పేరుతో మరికొంతమంది డాక్యుమెంటరీ రైటర్లు ఇక్కడ పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ పర్వాన్ని కొనసాగిస్తున్నారు. కొణిజర్ల మండలం అమ్మపాలెంలో జరిగిన రిజిస్ట్రేషన్ల పర్వాన్ని ఒక్కసారి జిల్లా అధికారులు బయటికి తీసి ప్రతి డాక్యుమెంట్లను పరిశీలిస్తే అసలు ఈ డాక్యుమెంట్ రైటర్లు పెట్టిన తప్పుడు డాక్యుమెంట్లతోనే జరిగిన రిజిస్ట్రేషన్లు పర్వం బట్టబయలవుతుంది. ఎందుకంటే డాక్యుమెంటరీ రైటర్లు వారి సంపాదన పేరుతో ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌ల వేల సంఖ్యలో డబ్బులు దండుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి అవే నిజమైన డాక్యుమెంట్లని రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు పంపించి వాటితో రిజిస్ట్రేషన్ చేయించడం జరుగుతుంది. ఈ తతంగం మొత్తం కొంతమంది బ్రోకర్లు పెట్టుకొని ఆ బ్రోకర్ల ద్వారా నడిపిస్తున్నారు. పార్టేషన్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతిని జరగడానికి కారణం. ఈ డాక్యుమెంట్ రైటర్లే వైరా సబ్ రిజిస్టర్ పరిధిలో ఇప్పటివరరకు కొంతమంది డాక్యుమెంటరీ రైటర్లలో చేసిన రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్లు ఎక్కువ శాతం నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ధృవీకరణ పత్రాలతో చేసినవే కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు లేకుండా కొన్ని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి ఇళ్ళు లేకపోయినా ఇళ్ళు ఉన్నట్లు వేరే ఇళ్ళ వద్ద ఫొటోలు దిగి ఆ ఫొటోలను పెట్టి వాటితో రిజిస్ట్రేషన్ చూపించడం ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటి కాదు రెండు కాదు పెద్ద ఎత్తున తప్పుడు రిజిస్ట్రేషన్లకు డాక్యుమెంట్ రైటర్లు తెర లేపారు. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఎందుకు ఎందుకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తున్నా కూడా ఆ డాక్యుమెంటరీలపై చర్యలు తీసుకోవడం లేదు. పెట్టిన డాక్యుమెంట్ రైటర్ డాక్యుమెంట్లు మొత్తం సరిగానే ఉన్నాయా లేదా అనేది పూర్తిస్థాయిలో ఎందుకు విచారణ చేయలేకపోతున్నారు. జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా వైరాలో జరుగుతున్న తప్పుడు రిజిస్ట్రేషన్‌లలో కీలకపాత్ర కొంతమంది డాక్యుమెంటరీ రైటర్లది అయితే వారికి సహకరించింది మరికొందరు అవుతున్నారు. కొంతమంది ఏజెంట్లు తప్పుడు రిజిస్ట్రేషన్‌లలో భాగస్వాములు అవుతున్నారు. వైరా మండలం వల్లాపురం గ్రామంలో ఏజెట్లను ఏర్పాటు చేసుకొని ఆ ఏజెంట్ల ద్వారా మండలంలో పలు గ్రామాల్లో మరికొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని అమాయక ప్రజలను లోన్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దోచిన కాడికి దోచుకుంటున్నారు. అయ్యా జిల్లా కలెక్టర్ గారు వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న కొంతమంది డాక్యుమెంటర్ రైటర్ల దందాపై మీరు ప్రత్యేక దృష్టి పెడితే జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్ పర్వం పూర్తిస్థాయిలో బట్టబయలు అవుతుంది.

# రామాలయంలో ఘనంగా ధ్వజారోహణం



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం ఘనంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ మహావిష్ణువుకి ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటాన్ని ఈ సందర్భంగా ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. నేటి నుండి పూర్ణిమ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు దేవతలకు, ఇటు మానవులకు తెలిసే విధంగా ఈ ధ్వజారోహణ జరుపుతారు. అలాంగే అష్టదిక్పాలకు, పంచలోక పాలకులు దేవతలను ఆహ్వానించే భేరి పూజా కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత ఆయా దేవతలకు ఇష్టమైన ప్రసాదాలను అర్పించి బ్రహ్మోత్సవాలు జరిగినన్ని రోజులు ఆలయంలో ఉండి స్వామివారి దర్శించుకునే భక్తులకు శుభం కలిగేలా దీవించాలని కోరుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్వజారోహణాన్ని పురస్కరించుకుని అందజేసిన ప్రసాదాన్ని గరుడ మద్దులను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. అందించే గరుడ ముద్దల ప్రసాదాన్ని స్వీకరిస్తే పండంటి బిడ్డలు కలుగుతారని అపరామైన నమ్మకం ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ రమాదేవి, ఏఇఓ భవాని రామకృష్ణ, పర్యవేక్షకులు సాయిబాబా, కేఇ స్థలశాయి, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాధి విజయ రాఘవన్, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ స్తంభాల ఏర్పాటులో కాంట్రాక్టర్ మాయాజాలం






**-నిబంధనలకు విరుద్ధంగా స్థంభాల ఏర్పాటు**
**-ప్రతి స్తంభానికి కాంక్రీట్ ఎక్కడ..?**
**-అధికారులు పొంతనలేని మాటలు**

**ప్రజాపక్షం/వైరా:** మున్సిపాలిటీ పరిధిలోని మధిర రోడ్డులో విద్యుత్ స్థంభాలు ఏర్పాటులో కాంట్రాక్టర్ మాయాజాలం ఇప్పుడు ఒక చర్చనీయాంశంగా మారింది. ఎలాంటి నిబంధనలు అనుమతులు రాకముందే తన ఇష్టానురాజ్యంగా విద్యుత్ స్థంభాల ఏర్పాట్లు చక్కచక్క చేయడం వెనుక ఆంతర్యమేమిటి. విద్యుత్ అధికారులకు కాంట్రాక్టర్‌కు మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఎందుకంటే ఎలాంటి అనుమతులు లేకుండా వర్క్ ఆర్డర్ రాకుండానే ఇష్టానుసారంగా స్థంభాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నాడు. ఒక కరెంటు స్థంభం ఏర్పాటు చేయాలి అంటే ఆ స్థంభం వేసేందుకు మూడు మూడు వెడల్పు గుంట తీసి ఐదు అడుగుల లోతులో నుండి ఆ స్థంభం వేసేందుకు కాంక్రీట్ దిమ్మెను తప్పనిసరి వేయాలి. అలా ప్రతి స్థంభానికి కాంక్రీట్ దిమ్మెలు చేసుకుంటూ గట్టిగా ఉండేవిధంగా చూస్తూ స్థంభాలు ఏర్పాటు కొనసాగాలి. కాని అలా చేయకుండా నామమాత్రంగా మాములుగా భూమిలో గుంటలు తీసి స్థంభాలు వేశారు. ఇది అధికారులకు కనిపించడం లేదా. ఇది వాస్తవం కాదా, ఒక్కసారి ఆలోచించండి, ఎందుకంటే మున్సిపాలిటీ పరిధిలో స్థానిక రింగు రోడ్డు నుండి నాలుగు రోడ్ల నిర్మాణ పనులకు అనుమతులు మంజూరయ్యాయి. ఆ అనుమతులు రోడ్ల నిర్మాణంలో భాగంగా రోడ్ల ప్రక్కన కరెంటు స్థంభాలు వేయడానికి సుమారు కోటి రూపాయలు పైన నిధులతో స్థంభాలు విద్యుత్‌లైన్ ఏర్పాటుకు కాంట్రాక్టర్‌ను నియమించారు. అసలు ఆ కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారమే వర్క్‌ను దక్కించుకున్నాడా, ఒకవేళ నిబంధనల ప్రకారం వర్క్ అతనికి వచ్చి ఉంటే అడ్డదారిలో వర్క్ చేయాల్సిన అవసరం ఏమిటి, దీనిపై విద్యుత్‌శాఖలో ముగ్గురు అధికారులు చెప్పిన మాటను చూస్తే ఒకరికి ఒకరు ఎలాంటి పొంతన లేకుండా చెప్పారు. తప్ప వాస్తవాన్ని కప్పిపుచ్చారు. ఎందుకంటే వర్క్ ఆర్డర్ రాకుండానే పనులు ప్రారంభిస్తే సంబంధిత విద్యుత్ అధికారులు ఆ పనులు ఆపకుండా అతనిని ఎందుకు చేస్తున్నామని మందలించకుండా మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యం ఏమిటి. దీనిపై విద్యుత్‌శాలో ఉన్న డిఈ ఏడి ఏఈ వివరణ అడుగగా ముగ్గురు ఒకరిపై ఒకరు చెప్పారే తప్ప పూర్తిస్థాయి సమాచారాన్ని చెప్పకుండా దాటవేశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు జోక్యం చేసుకొని నిబంధనలకు ప్రకారం పాటించకుండా వేసిన స్థంభాలను తీసివేసి మరల పూర్తిస్థాయిలో ప్రతి స్థంభం కాంక్రీట్ చేసి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయశాఖ, సమాచార శాఖ కమీషనర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం ఆయన మిథిలా స్టేడియం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వైభవో పేతంగా ఎక్కడా లేని విధంగా కళ్యాణం జరిగే పుణ్యక్షేత్రం భద్రాచలం అన్నారు. లోకకళ్యాణార్ధం జరిగే వేడుకలో పాల్గనడం ద్వారా పుణ్యం వస్తుందన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సదుపాయంతో పాటు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సెక్టార్లు వారిగా సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు టిక్కెట్లు కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఏ పిఓ ప్రతీక్ జైన్, ఇఓ రమాదేవి, ఏఇఓలు రవీంధర్, శ్రావణ్ తదితరులున్నారు.

# ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో మోసం

**-అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత**
**-చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో అనుమతులు లేకుండా అడ్మిషన్ల పేరుతో ఫీజుల మోత మోగిస్తున్న పాఠశాల యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ 2024 25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయన్నారు. కొన్ని స్కూళ్లలో అప్పుడే అడ్మిషన్లు పూర్తియ్యాయని చెప్పడం బాధాకరమన్నారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు తక్కువగానే ఉన్నాయని మిగిలిన కొన్ని కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లు మాత్రం ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా దండుకుంటున్నాయన్నారు. కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాఠశాలలను నియంత్రించడంలో అధికారులు ధ్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నారన్నారు. అడ్మిషన్ల సమయంలోనే డోనేషన్, బుక్స్, యూనిఫాం, ఐఐటి ఫౌండేషన్ ఇతరత్రా రకరకాల పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యా శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజులు వసూలు చేయాల్సి ఉన్నా అవి పాఠశాలలు పట్టించుకోవడం లేదని, ఫీజుల వివరాలను నోటీసు బోర్డులలో పెట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేటు పాఠశాలల దోపిడీని నిలువరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, రాహుల్, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాకేట్ బాంబ్ దాడిని ఖండించండి

**ఆదివాసీల ఉనికి, గుర్తింపుకు ముప్పు**
**మావోయిస్టుల లేఖ**



**ప్రజాపక్షం/ చర్ల :** వారం వ్యవధిలో సుక్మాజిల్లాలోని పుర్వి గ్రామంలోని శిబిరం నుంచి రోజంతా రాకేట్ లాంచర్లతో బాంబుల దాడి చేస్తున్నారని ఈ దాడిని యావత్ సమాజం ఖండించాలని కోరుతూ మావోయిస్టులు సోమవారం లేఖ విడుదల చేశారు. పోలీస్ క్యాంపు ఏర్పాటు చేసినప్పటి నుంచి గిరిజన గ్రామాలపై రాకేట్ లాంచర్లు డ్రోన్ల ద్వారా దాడులు చేస్తున్నారని చుట్టు పక్కల గిరిజన గ్రామాల వాసులు భయాందోళనకు గురవుతున్నారని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు. బాటం, కౌరుగట్ల, జబ్బగట్ల గ్రామాల చుట్టూ ఉన్న పొలాలు, అడవులు, పర్వతాలను లక్ష్యంగా చేసుకుని బాంబు దాడులు చేస్తున్నారని ఈ ప్రాంతంలో జన జీవనం పూర్తిగా స్తంభించిపోయిందని బాంబుల తీవ్రత ఎక్కువగా ఉందని 70 నుంచి 80 కిలో మీటర్ల కంటే ఎక్కువ దూరంలో శబ్దాలు వినపడుతున్నాయని ప్రాణ, ఆస్తి నష్టమే కాకుండా పర్యావరణానికి పోలీస్ బలగాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని లేఖలో ఆరోపించారు. నీరు, ఖనిజ సంపద, వనరులను దేశంలోని కార్పొరేట్ సంస్థలకు అప్పగించి గిరిజనుల అస్థిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని గుర్తింపును నాశనం చేసే కుట్రలో కేంద్రంలోని హిందూత్వ ఫాసిస్టు బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని లేఖలో ఆరోపించారు. ప్రజాస్వామిక అభ్యుదయ దేశభక్తి శక్తులు, రచయితలు, రైతులు, కార్మికులు, విద్యార్థి, యువజనులు, మానవ హక్కుల కార్యకర్తలు ఈ విధ్వసానికి వ్యతిరేకంగా పోరాటానికి ముందుకు రావాలని, పోరాడే శక్తులకు మద్దతు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.